క్లుప్తంగా

అక్రమ బదిలీలపై విచారణ జరిపించాలి

కడప ఎడ్యుకేషన్ : ఇంటర్ ఆర్‌జేడీ ఇటీవల నిర్వహించిన ఉద్యోగుల బదిలీలలో అక్రమాలకు పాల్పడ్డాడని, దానిపై విచారణ జరిపించాలని ఆల్ ఇండియా స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జగదీష్, రాష్ట్ర కార్యదర్శి నాగరాజు కోరారు. ఈ విషయమై సోమవారం గ్రీవెన్స్‌సెల్‌లో జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటర్‌కు సంబంధించి రాయలసీమ జోన్ పరిధిలో కాంటాక్టు లెక్చరర్లు, టైపిస్టు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లుకు ఇటీవల ప్రమోషన్లు, బదిలీలు నిర్వహించారన్నారు. ఈ బదిలీల్లో ఆర్‌జేడీ బోర్డు అధికారుల అండతో ఇష్టానుసారంగా వ్యవహరించి వారి నుంచి డబ్బులు వసూలు చేశారని ఆరోపించారు. ఈ విషయంపై విచారణ జరిపించి ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు.

వాహనాలు కండీషన్‌లో ఉండాలి

కడప కార్పొరేషన్ : కడప నగరపాలక సంస్థకు చెందిన వాహనాలన్నీ కండీషనల్‌లో ఉండేలా చూసుకోవాలని అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్ర ఆదేశించారు. సోమవారం పాత మున్సిపల్ కార్యాలయంలో ఉన్న వెహికల్ డిపోలో ఉన్న వాహనాలను, వాహనాల పట్టికలు, రిజిస్టర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పారిశుధ్య వాహనాలు, డీసిల్టింగ్ మెషీన్లు కేటాయించిన సమయానికి వెళ్లిపోవాలని, వాహనాలకు ఏవైనా మరమ్మతులు ఉంటే తక్షణం చేయించి ఉపయోగంలోకి తేవాలన్నారు. అనంతరం మాసాపేట ప్రాంతంలో పర్యటించి మాసాపేట సర్కిల్ వెళ్లే మార్గాన్ని శుభ్రంగా ఉంచాలని, అక్కడ ఉన్న చెత్తపాయింట్లను తొలగించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగులకు పీఆర్సీ అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా

కడప ఎడ్యుకేషన్ : ఉద్యోగ, ఉపాధ్యాయులకు 12వ పీఆర్సీని వెంటనే అమలు చేయాలని, పీఆర్సీ అమలయ్యే వరకు 30 శాతం మధ్యంతర భృతి ఇవ్వాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్‌బాబు డిమాండ్ చేశారు. సోమవారం కడపలోని యూటీఎఫ్ భవన్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలను తక్షణం చెల్లించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. తమ అవసరాల కోసం దాచుకున్న పీఎఫ్ రుణాలు, ఏపీజీఎల్ఐ రుణాలు, తుది చెల్లింపులు, సరెండర్ లీవ్ బకాయిలు, గత పీఆర్సీ బకాయిలతోపాటు డీఏ బకాయిలను తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న రెండు డీఏలను దసరా కానుకగా విడుదల చేయాలని కోరారు. ఈ సమావేశంలో యూటీఎఫ్ జిల్లా ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శి సి.వి.రమణ, ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్ పాల్గొన్నారు.

హెల్పర్లకు పదోన్నతులు కల్పించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంతోపాటు జిల్లా వ్యాప్తంగా అర్హులైన హెల్పర్లకు పదోన్నతులు కల్పించాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు మనోహర్ కోరారు. సోమవారం ఐసీడీఎస్ పీడీ దేవిరెడ్డి శ్రీలక్ష్మికి ఈ మేరకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడపలో చాలాచోట్ల అర్హత ఉన్నా పదోన్నతులు కల్పించలేదన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో పలు ప్రాంతాల్లో హెల్పర్లు లేరని, జిల్లా వ్యాప్తంగా 13 ప్రాజెక్టులలో ఇదే పరిస్థితి ఉందన్నారు. ఒకవైపు రాజకీయ వేధింపులు, మరోవైపు పదోన్నతులు కల్పించకపోవడంతో అంగన్వాడీ వర్కర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అనంతరం పీడీ అర్హులకు పదోన్నతులు కల్పిస్తామని హామీ ఇచ్చారన్నారు.

దూర ప్రాంత ఇన్‌చార్జి వార్డెన్లతో ఇక్కట్లు

కడప సెవెన్‌రోడ్స్ : సాంఘిక సంక్షేమ హాస్టళ్లకు దూర ప్రాంతాలకు చెందిన ఇన్‌చార్జి వార్డెన్లను నియమించడం వల్ల విద్యార్థులకు రక్షణ లేకుండా పోతోందని, స్థానికంగా ఉన్న వారిని మాత్రమే ఇన్‌చార్జి బాధ్యతల్లో నియమించాలని అఖిల భారత విద్యార్థి బ్లాక్ జిల్లా కన్వీనర్ సగిలి రాజేంద్రప్రసాద్ కోరారు. సోమవారం జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌కు ఆయన వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల చాలా మంది రిటైర్డ్ కావడం, ముందు నుంచే రెగ్యులర్ పోస్టులు భర్తీ కాకపోవడం వల్ల హాస్టల్ వార్డెన్ల కొరత వేధిస్తోందన్నారు. ముఖ్యంగా బద్వేలులోని బాలికల వసతి గృహం-2 వార్డెన్ రిటైర్డ్ కావడంతో అక్కడికి 45 కిలోమీటర్ల దూరంలో ఉన్న బాలికల హాస్టల్-2 వార్డెన్‌ను ఇన్‌చార్జిగా నియమించారన్నారు. ఇందువల్ల విద్యార్థులకు రక్షణ, పౌష్టికాహారం అందడం లేదన్నారు. బి.మఠం ఎస్సీ-1 హాస్టల్‌కు పోరుమామిళ్ల బాలుర హాస్టల్ వార్డెన్‌ను, కలసపాడు బాయ్స్ హాస్టల్‌కు బి.మఠం వార్డెన్‌ను నియమించారన్నారు. కనుక స్థానికంగా ఉన్న వారికే ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌బీ నాయకుడు చరణ్ తదితరులు పాల్గొన్నారు.

జయములివ్వు తల్లీ.. జగజ్జననీ



శ్రీ మోహినీ అలంకరణలో కన్యకాంబ



శ్రీ విజయదుర్గమ్మకు స్కంధమాత అలంకారం

కడప కల్చరల్ : కడప నగరంలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. అమ్మవారిని భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకుని, జయములివ్వు తల్లీ జగజ్జననీ అని వేడుకున్నారు. దేవునికడపలోని శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి సోమవారం గరుడ వాహనంపై భక్తులను కరుణించారు. మాడవీధులలో విహరించిన స్వామి భక్తులకు కనుల పండువ చేశారు. స్థానిక విజయదుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని స్కంధమాతగా కొలువుదీర్చారు. ఈ సందర్భంగా చిన్నారుల కోలాటాలు, నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ఆలయం వెలుపల రోడ్డు, ఆలయం ఎదురుగా వాహనాలతో నిండిపోయింది. పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. అమ్మవారిశాలలో శ్రీ కన్యకా పరమేశ్వరీదేవిని మోహినీమాతగా అలంకరించారు. చుట్టూ ఏర్పాటు చేసిన తోట సెట్టింగ్ ఆహ్లాదం గొలిపింది. స్థానిక గడ్డిబజారు శ్రీ సత్యదేవుని ఆలయంలో స్వామిని శ్రీ రంగనాథస్వామిగా అర్చకులు విజయ్‌భట్టర్ తీర్చిదిద్దారు. శ్రీ కామకోటి కళాంబదేవిని పార్వతీమాతగా తీర్చిదిద్దారు. బాల పోలేరమ్మను పార్వతీదేవిగా కొలువుదీర్చారు. నడివీధి గంగమ్మను మధురమీనాక్షిగా అలంకరించారు. శ్రీ రాజరాజేశ్వరీ ఆలయంలో అమ్మవారిని అన్నపూర్ణగా తీర్చిదిద్దారు. శ్రీ లలితాంబిక ఆలయంలో అమ్మవారిని శ్రీ రాజరాజేశ్వరీదేవిగా అలంకరించారు. ఇంకా నబీకోట రామలింగ చౌడేశ్వరీ, నాగరాజుపేట రాజరాజేశ్వరి, బేల్దారివీధి గంగమ్మ ఆలయం, ఎర్రముక్కపల్లె శ్రీ చౌడేశ్వరీదేవి ఆలయం, నగర శివార్లలోని శ్రీ లలితాంబిక ఆలయం, రాజారెడ్డివీధిలోని గంగాదేవి, సరస్వతి ఆలయాలలో కూడా ప్రత్యేక అలంకారాలు నిర్వహించారు. భక్తులు కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకునేందుకు ఆలయాలకు చేరుకున్నారు. ధగధగలాడుతున్న విద్యుత్ దీప కాంతుల్లో సువర్ణ ఆభరణాలతో మెరిసిపోతున్న అమ్మవారి దివ్య మంగళ స్వరూపాన్ని తిలకించి మైమరిచిపోయారు. తమ పిల్లాపాపలను చల్లాగా చూడాలని, కష్టాలను తీర్చేందుకు నీవు తప్ప మరొకరు లేరని అమ్మవారిని మనసారా మొక్కుకున్నారు.



గరుడ వాహనంపై కడప రాయుడు



శ్రీ రాజరాజేశ్వరిగా శ్రీ లలితాంబిక



మధుర మీనాక్షిగా నడివీధి గంగమ్మ



పార్వతీమాతగా శ్రీ కామకోటి కళాంబదేవి

అమ్మవారిని దర్శించుకుందాం రండి!

కడప కల్చరల్ : దసరా అంటే సరదాల పండుగ. వేసవి తర్వాత ఎక్కువ సెలవులు తెచ్చే పండుగ దసరా. చల్లగా ఉండాల్సిన వాతావరణం ఎండలతో చికాకు తెప్పిస్తోంది. ఉదయం, సాయంత్రం అలా ఎక్కడికైనా బయటికి వెళ్లి సెలవులను ఆనందంగా గడపాలనిపిస్తుంది. ఎటూ దసరా పండుగ గనుక ఈ సందర్భంగా అమ్మవారికి చేసే అలంకారాలు బాగుంటాయని... కనుల పండువగా చూడవచ్చని దర్శనానికి భక్తులు బారులు తీరుతున్నారు. నగరానికి చెందిన ఓ భక్తుడు సాయంత్రం భార్యాపిల్లల సమేతంగా అమ్మవారిని దర్శించుకునేందుకు బయలుదేరాడు.

'ఇదిగోరా చిన్నా... ఇది శ్రీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయం. దీన్ని అమ్మవారిశాల అని కూడా అంటారు తెలుసా... ప్రొద్దుటూరు తర్వాత దసరా వేడుకలు ఈ ఆలయంలో ఘనంగా నిర్వహిస్తారు. ఇది 150 ఏళ్ల చరిత్రగల ఆలయం. దసరా ఉత్సవాలు భలే గొప్పగా చేస్తారు. ఓపిగ్గా క్యూలో నిలుచొని అమ్మవారిని దర్శించుకుందాం.. సరే మరి.. ఇక ఈ ఉత్సవాలు ఘనంగా జరిగే శ్రీ విజయదుర్గ మాతను కూడా దర్శించుకుందామా...! అమ్మో ఇక్కడ జనం ఎక్కువగా ఉన్నారు కదూ, అయినా ఫర్వాలేదు.. క్యూలో వెళ్లి అమ్మను చూసొద్దాం.. అటు చూడు.. పట్టు వస్త్రాల్లో బంగారు ఆభరణాలు ధరించి అమ్మవారు దేదీప్యమానంగా కళ్లు చెదిరేలా కనిపిస్తోంది కదూ. మన సారా మొక్కుకోరా బుజ్జీ.. చదువు బాగా వస్తుంది. చిన్నీ నువ్వుకూడా అమ్మను బాగా చూసి దండం పెట్టుకో.. అయిందా మరి. గడ్డిబజారు శివాలయంలో అమ్మవారితోపాటు శ్రీ సత్యనారాయణ స్వామిని కూడా చూడొచ్చు. రండి వెళదాం.. హమ్మయ్యా... ఇక్కడ కూడా దర్శనం బాగా అయింది.. అబ్బో ప్రసాదాలతోనే కడుపు నిండిపోయింది కదూ!

ఇక ఇంటికెళదామా..

ఎటూ సెలవులే కదండీ.. ఎప్పుడూ అందరం కలిసి బయటికి వచ్చేది లేదు. కనీసం ఇప్పుడైనా మరో రెండు ఆలయాలు చూసి అమ్మను దర్శించుకుందాం. మన కుటుంబం, బంధుమిత్రులు హాయిగా ఉండాలని కోరుకుందాం. సతీమణి గారూ.. నీ మనసు నాకు తెలియదా.. సరే పదా.. ఇంకా రాజరాజేశ్వరీదేవిని, చిన్నచెప్పవీధిలో బాల పోలేరమ్మను, నబీకోట శివాలయంలోనూ, ఎర్రముక్కపల్లెలోని చౌడేశ్వరీమాతను కూడా దర్శించుకుందాం.. అమ్మవార్లను మనసారా మొక్కుకో.. ముఖ్యంగా బుజ్జిగాడు, చిన్ని ఆరోగ్యాలు, చదువులు బాగుండాలని కోరుకో.. అన్నీ బాగా జరిగితే వచ్చే దసరాకు ఏదో ఒక గుడిలో ఉత్సవాల నిర్వహణకు మనం శక్తికొద్దీ చందా ఇద్దాం! అదిగో కళ్లు చెదిరే విద్యుద్దీపాల కాంతులు వెదజల్లుతున్న అమ్మవారి ఆలయంలోకి వెళదాం.. పదా..! అని విజయదుర్గ ఆలయానికి చేరుకున్నారు. 'ఇదిగో నగరంలో పేరుగాంచిన శ్రీ వియదుర్గాదేవి ఆలయం ఇదే' ఈ ప్రాంగణం ఎంతో విశాలంగా, ప్రశాంతంగా ఉంది కదూ.. జనం ఎక్కువగా ఉన్నారు.. అయినా ఫర్వాలేదు.. ఓపికగా ఉండి దర్శించుకుంటేనే అమ్మ అనుగ్రహిస్తారు! అక్కడ దర్శనం ముగించుకుని మద్రాసురోడ్డులోని శ్రీ లలితాంబిక ఆలయానికి చేరుకున్నారు. దూరం నుంచే ఆలయాన్ని గమనించిన భక్తుడి భార్య ఆశ్చర్య పోయింది. 'అబ్బా.. ఈ ఆలయం చాలా పెద్దదిలా ఉందే..' అవును ఇది ఇటీవలే చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో నిర్మించారు. ఇది ఐదు ఆలయాల సమూహం. అమ్మవారిని లలితాంబిక అంటారు. ఓపిగ్గా క్యూలో వెళ్లి దర్శించుకుని తరిద్దాం పదా'.. అంటూ అమ్మవారి దర్శనానికి వెళ్లారు. ఇలా నగరంలోని ప్రముఖ అమ్మవారి ఆలయాలను కనులారా దర్శించుకుని ఇంటికి చేరుకున్నారు.



బాల పోలేరమ్మ ఆలయంలో పార్వతీమాతగా అమ్మవారి దర్శనం



శ్రీ లలితాంబిక ఆలయంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

మార్కెట్‌లోకి బజాజ్ ఫ్రీడం 125 వాహనాలు



బజాజ్ ఫ్రీడం 125 వాహనాలను ఆవిష్కరిస్తున్న నగర మేయర్, మాజీ డిప్యూటీ సీఎం

కడప కార్పొరేషన్ : బజాజ్ ఆటో లిమిటెడ్ మొట్టమొదటిసారిగా ప్రవేశపెట్టిన సీఎన్‌జీ మోటార్ సైకిల్ బజాజ్ ఫ్రీడం 125 అట్టహాసంగా మార్కెట్‌లోకి విడుదలైంది. ఆదివారం రాత్రి స్థానిక రాజీవ్ పార్కు వద్ద ఈ వాహనాలను మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐసీఈ మోటార్ సైకిళ్లతో పోల్చితే బజాజ్ ఫ్రీడమ్ నిర్వహణ ఖర్చులను 50 శాతం వరకూ తగ్గిస్తుందన్నారు. ఇది 2లీటర్ పెట్రోల్ ట్యాంక్‌తో డ్యూయల్ ఫ్యూయల్ సామర్థ్యం కలిగి ఉందన్నారు. 330 కి.మీ మిశ్రమ పరిధిని ఇస్తుందన్నారు. మోనో లింక్డ్ సస్పెన్షన్స్, ఎల్ఈడీ హెడ్‌ల్యాంప్స్, డిజిటల్ స్పీడోమీటర్, ఇది మూడు వేరియంట్లలో లభిస్తుందన్నారు. దీని ధర రూ.95 వేల నుంచి ప్రారంభమవుతుందన్నారు. 2 కేజీల సీఎన్‌జీ ఇంధనంతో 200 కి.మీ మైలేజీ ఇస్తుందని, దీనిలో అదనగా 2లీటర్ల పెట్రోల్ ట్యాంకు ఉందన్నారు. ఒకవేళ సీఎన్‌జీ ట్యాంక్ ఖాళీ అయితే పెట్రోల్‌తో 130 కి.మీ మైలేజీ ఇస్తుందన్నారు. పర్యావరణానికి సీఎన్‌జీ వాహనాలు మేలు చేస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రామలక్ష్మణ్‌రెడ్డి, షఫీ, బంగారు నాగయ్య యాదవ్, త్యాగరాజు, శ్రీరంజన్‌రెడ్డి, శంకరాపురం సింధు తదితరులు పాల్గొన్నారు.

స్పేస్ వీక్ ఎగ్జిబిషన్‌తో సృజనాత్మక ఆలోచనలు



ఇస్రో ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న షార్ డిప్యూటీ డైరెక్టర్ రమేష్‌బాబు

కడప ఎడ్యుకేషన్ : స్పేస్ వీక్ ఎగ్జిబిషన్ తిలకించడం వల్ల పిల్లలలో సృజనాత్మక ఆలోచనలు ఉద్భవించే అవకాశం ఉంటుందని, దీంతో పాటు వారిలో ఆలోచనా విధానం పరిశోధన వైపు అడుగులు వేసేందుకు సాధ్యమౌతుందని షార్ డిప్యూటీ డైరెక్టర్ రమేష్‌బాబు, ఏపీపీటీ జోనల్ ఆఫీసర్ ఎస్ఎస్ మురళి అన్నారు. కడప నగర శివారులోని కేఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం కేఎస్ఆర్ఎం, ఇస్రో సంయుక్తంగా నిర్వహించిన వరల్డ్ స్పేస్ వీక్-2024 కార్యక్రమంలో భాగంగా స్పేస్ వెదర్ చేంజ్ థీమ్ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సైన్సు ఎగ్జిబిషన్, ఎలక్యూషన్, ఎస్సేరైటింగ్, షార్ట్‌ఫిల్మ్, సైన్సు మోడల్స్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ ఈ ఇస్రో ఎగ్జిబిషన్‌ను జిల్లాలోని వివిధ పాఠశాలలోపాటు కళాశాలకు చెందిన 2 వేల మంది దాకా విద్యార్థులు తిలకించినట్లు కేఎస్ఆర్ఎం ప్రిన్సిపాల్ వీఎస్ఎస్‌మూర్తి తెలిపారు. 25 మంది ఇస్రో సైంటిస్టులు పాల్గొని పిల్లలకు పలు అంశాలను వివరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టీఎన్ ప్రసాద్, కల్చరల్ క్లబ్ కో ఆర్డినేటర్ డాక్టరు వీరశంకర్, కాలేజీ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ సురేష్ బాబుతోపాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'ఆ టమాట సరఫరాదారులపై చర్యలు తీసుకోవాలి'

కడప సెవెన్‌రోడ్స్ : కడప రైతు బజారులో నాసిరకం టమాటలు సరఫరా చేసిన వారిపై చర్యలు చేపట్టాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి కోరారు. సోమవారం డీఆర్వో గంగాధర్‌గౌడ్‌కు ఆయన వినతిపత్రాన్ని సమర్పించారు. నాణ్యమైన టమాటల సరఫరాలో మార్కెటింగ్ అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ఆదివారం రైతు బజారుకు వచ్చిన టమాటల్లో 2 వేల కిలోలు కుళ్లిపోయి, నాసిరకంగా ఉన్నాయన్నారు. వీటిని కిలో రూ.45లతో ప్రజలకు విక్రయించాలని చూడగా, వారు వాటిని తిరస్కరించారన్నారు. మదనపల్లె కాంట్రాక్టర్ ద్వారా కొనుగోలు చేశారన్నారు. వీటిని వెనక్కి పంపకుండా రైతు బజారులో విక్రయాలకు ఆమోదించడం విచారకరమన్నారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : నూతన ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు కావస్తున్నా రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులకు బకాయి పడిన పీఆర్సీ, అరియర్స్, డీఏ మొత్తాలను వెంటనే చెల్లించేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు శీలం గంగన్న కోరారు. సోమవారం స్థానిక ప్రకాశ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 11వ పీఆర్సీ వెంటనే ప్రకటించి దానిని అమలు చేసేలాగా మధ్యంతర భృతిని ప్రకటించాలన్నారు. విశ్రాంత ఉద్యోగులు మధ్యంతర భృతి, డీఏ బకాయిల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. త్వరలో మంత్రివర్గ సమావేశం జరగనున్న నేపథ్యంలో విశ్రాంత ఉద్యోగులకు తీపి కబురు అందించాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల అందజేత



నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఆర్టీసీ ఉన్నతాధికారులు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఇటీవల విజయవాడ పరిసర ప్రాంతాల్లో వరద ముంపునకు గురైన ఆర్టీసీలో ఔట్‌సోర్సింగ్ కింద పని చేస్తున్న 131మంది కార్మికులకు ఆర్టీసీ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు సోమవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గజపతి, ఉప ప్రధాన కార్యదర్శి గంగాంజనేయులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్‌లో ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి ప్రభుత్వ దృష్టికి తీసుకు వెళ్లాలని కోరారు. కష్టకాలంలో ఉద్యోగులకు తమవంతుగా నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సుధీర్‌కుమార్, మధుసూదన్‌రావు, హరిప్రసాద్, విజయ్, గౌరీశంకర్, సోమశేఖరరెడ్డి, దాసరి కిరణ్‌కుమార్, నవీన్ కుమార్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలి



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ రాకేష్ చంద్ర

కడప కార్పొరేషన్ : ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్ర అన్నారు. సోమవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలోని వీసీ హాలులో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అర్జీదారులు ఇచ్చిన సమస్యలపై వారి ప్రాంతానికి వెళ్లి పరిశీలించి న్యాయ పద్ధతిలో పరిష్కరించాలన్నారు. ఇందులో మొత్తం 22 అర్జీలురాగా, ఇంజినీరింగ్ విభాగం-8, టౌన్‌ప్లానింగ్-5, రెవెన్యూ-6, హెల్త్ విభాగం -2, ఆర్‌అండ్‌బి-1 అర్జీలు వచ్చాయి. వీటిని నిర్దేశిత సమయానికి పరిష్కరించాలని కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్ఓ చంద్రశేఖర్, ఏసీపీ నాగేంద్ర, ఈఈ ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శివ కవి యుగంలోనే వీర శైవ వైభవం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వైవీయూ అధికారులు, ఇతర అతిథులు

కడప కల్చరల్ : శివ కవి యుగంలోనే వీరశైవ మతం వైభవం చాటిందని, ఆ మత సంప్రదాయానికి పట్టం కట్టిందని యోగి వేమన విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జ్ వైస్ చాన్సలర్ ఆచార్య కె.కృష్ణారెడ్డి పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో డాక్టర్ సత్తెనపల్లిబాబు రచించిన 'వీరశైవ సాహిత్యం-సామాజిక దృక్పథం' పుస్తకావిష్కరణ సభ సోమవారం బ్రౌన్ కేంద్రంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కృష్ణారెడ్డి మాట్లాడుతూ డాక్టర్ సత్తెనపల్లిబాబు రచించిన గ్రంథంలో వీరశైవ మత సిద్ధాంత లక్షణాలను తెలిపి వీరశైవ సాహిత్యంలో అవి ప్రతిఫలించిన తీరును విశ్లేషించారన్నారు. సభాధ్యక్షులు, బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి మాట్లాడుతూ నన్నెచోడుడు, మల్లికార్జున పండితారాధ్యుడు, పాల్కురికి సోమన శివకవి యుగంలో కవిత్రయంగా పేరు గాంచారన్నారు. విశిష్ట అతిథి, వైవీయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య టి.రామప్రసాద రెడ్డి మాట్లాడుతూ ప్రాచీన తెలుగు సాహిత్యంలో శివకవి యుగం విప్లవ యుగమని, సామాన్యునికి సాహిత్యంలో స్థానమిచ్చిన యుగమదన్నారు. వైవీయూ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య పుత్తా పద్మ మాట్లాడుతూ భారతదేశంలోని పలు తాత్విక సిద్ధాంతాలను పొందుపరచడం పుస్తకానికి మరింత శోభనిచ్చిందన్నారు. విశిష్ట అతిథి, యోగి వేమన విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ సత్తెనపల్లిబాబు గతంలో 'బసవ పురాణం ఛీ ఒక పరిశీలన' అనే అంశంపై పరిశోధన చేశారన్నారు. పుస్తక సమీక్షకులు, బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి మాట్లాడారు. తెలుగు అధ్యాపకులు ఎస్.వెంకటరమణ, డి.దానం రచయితను అభినందించారు. డాక్టర్ చింతకుంట శివారెడ్డి సభను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సిబ్బంది, సత్తెనపల్లి బాబు కుటుంబ సభ్యులు, మిత్రులు, బాల యల్లారెడ్డి, కొత్తపల్లి రామాంజనేయులు, కరీముల్లా, బాలరాజేశ్వర రెడ్డి, శ్యామసుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీ చక్రపురిలో కడప కామాక్షమ్మ

- జిల్లాలో అత్యంత పురాతనమైన శ్రీ చక్రం

కడప కల్చరల్ : కామాక్షిమాత పేరు వినగానే కంచి క్షేత్రం గుర్తుకు వస్తుంది. ఆ తల్లిని దర్శించుకోవాలనిపిస్తుంది. మన కడపలోని కూడా అలాంటి కామాక్షి మాత గురించి తెలిసే ఉంటుంది. కడప నగరానికి 14 కిలోమీటర్ల దూరంలో శ్రీ చక్రపురిగా పేరుగాంచిన పుష్పగిరిలో శ్రీ కామాక్షిదేవి కొలువై ఉన్న విషయం పలువురికి తెలిసిందే. శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఈ విషయం గురించి మరికొన్ని వివరాలు.

పినాకిని, పాపాఘ్ని, వల్కల, మాండవి, కుముద్వతి పంచనదుల సంగమమైన పుష్పగిరిలో ఆది శంకరాచార్యుల ఆదేశంతో ఆయన శిష్యులు శ్రీ విద్యారణ్యస్వామి మహా మేరువైన శ్రీ చక్రాన్ని ఇక్కడి కామాక్షి మాత సన్నిధిలో ప్రతిష్ఠించారు. దక్షిణ దేశంలో కంచి తర్వాత శంకరాచార్యుల పీఠం ఉన్నది కేవలం పుష్పగిరిలో మాత్రమే. పుష్పగిరి గ్రామంలోని శివాలయ సముదాయంలో శ్రీ కామాక్షి మాత కొలువై ఉన్నారు. అమ్మవారి మూల విరాట్ ఎదురుగా శ్రీ చక్రం ఉంది. అమ్మవారితోపాటు నవావరణ సహిత శ్రీ చక్రాన్ని విజయ నగర స్థాపకులైన శ్రీ విద్యారణ్యస్వామి ప్రతిష్ఠించారని చరిత్ర ద్వారా తెలుస్తోంది. ఈ క్షేత్రంలోని శ్రీ చక్ర సహిత జగన్మాత కామాక్షి దేవి జిల్లాలోని ప్రస్తుతం గల శ్రీ చక్రాల కంటే అత్యంత పురాతనమైనదని తెలుస్తోంది.

పురాణగాథ

ఈ మాత గురించి ప్రచారంలో ఉన్న పురాణ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మహిషాసురుని వధ అనంతరం జగన్మాత ఉగ్రరూపం దాల్చింది. ఆ రూపాన్ని చాలించమని, దేవతలంతా ప్రార్థించినా ఫలితం లేకపోవడంతో త్రిమూర్తులే స్వయంగా రంగ ప్రవేశం చేశారు. దాంతో అమ్మవారు శాంతి స్వరూపిణిగా భక్తులను కటాక్షించారు. సర్వకళలు, మహిమలను నిక్షిప్తం చేసిన శ్రీ చక్రాన్ని ఆ తర్వాత విద్యారణ్యస్వామి ప్రతిష్ఠించారు. మహిమాన్వితమైన శ్రీ చక్ర సహితురాలైన కోరిన కోర్కెలు తీర్చే చల్లని తల్లిగా శ్రీ కామాక్షిదేవిగా జగదాంబ ఈ క్షేత్రంలో స్థిరపడ్డారు. రాత్రివేళ ఆ తల్లి ఆలయ ప్రాంగణంలో సంచరిస్తారని భక్తుల విశ్వాసం. అందుకే భక్తులెవరూ ఆ ఆలయంలో నిద్ర చేయరు. ముఖ్యంగా నవరాత్రుల సందర్భంగా అమ్మవారి వదనంలో కొత్త వెలుగు కనిపిస్తుందని, మరీ ముఖ్యంగా దుర్గాష్టమి రోజున అమ్మవారి వదనంలో కోపం కనిపిస్తుందని స్థానికుల కథనం. ఈ చారిత్రక ఆధ్యాత్మిక ప్రశస్తిగల కడప కామాక్షమ్మను ఈ విజయదశమి సందర్భంగా దర్శించుకుందామా!



శ్రీ చక్ర సహిత కామాక్షిమాత



జిల్లాలోని అత్యంత పురాతనమైన శ్రీ చక్రం